ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -365 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 24 ఏప్రిల్ 2026




# గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు



**రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు**

**మరో రంగారెడ్డి కానున్న అనకాపల్లి**

**పరిశ్రమల రాకతో మెండుగా ఉద్యోగావకాశాలు**

**ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేదు**

**అనకాపల్లి, ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్):** విశాఖకు ఎక్కువ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలో ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు పెరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో పర్యటించిన సీఎం.. రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులను**మిగతా 2లో...**

# పోలింగ్ రికార్డు

**తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్**

**బెంగాల్‌లో ఘర్షణలు.. పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత**

**ఓటేసిన ప్రముఖులు, సినీతారలు**




**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::** పశ్చిమ బెంగాల్ తొలివిడత, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే పశ్చిమబెంగాల్‌లో 91.78 శాతం నమోదైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. దేశ స్వాతంత్ర్యం అనంతరం నమోదైన అన్ని ఎన్నికల్లో కంటే అత్యధికంగా తమిళనాడులో 84.69 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 8.39 గంటలకు పోలింగ్ వివరాలను ఇసి విడుదల చేసింది. చెన్నైలో 84.29 శాతం పోలింగ్ నమోదు కాగా, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్టు వెల్లడించారు. సాయంత్రం 6 గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. అప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు.**మిగతా 2లో...**

# ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

**హర్మ్యూజ్‌పై ట్రంప్ కీలక ఆదేశాలు**

**-నిర్బంధించినంత కాలం తెరిచేది లేదు : ఇరాన్**

**యుద్ధంతో పతనం దిశగా ఆర్థిక వ్యవస్థ**



**వాషింగ్టన్ : ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::** అమెరికా, ఇరన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోనే ఉన్నా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకలు మందుపాతరలు (సిమైన్స్) అమర్చుతున్నాయని, వాటిని గుర్తించి దాడి చేయాలని అమెరికా నౌకా దళాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు సోషల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు.**మిగతా 2లో...**

# పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రసక్తే లేదు: కేంద్రం



**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::** అసెంబ్లీ ఎన్నికల తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ. 25 నుంచి రూ. 28 వరకు పెరుగుతాయని వస్తున్నవార్తలను ప్రభుత్వం గురువారం కొట్టివేసింది. అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది. ఏప్రిల్ 29 నాటికి పశ్చిమబెంగాల్ **మిగతా 2లో...**

# పల్లెల్లో పవన్ మార్క్

**జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ విభాగం**

- **స్వయంప్రతిపత్తి, స్వావలంబన దిశగా అడుగులు**
- **ఫలితాన్నిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు**
- **గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం**
- **రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లోనూ నంబర్ వన్ స్థానం**



**(అమరావతిఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::** స్థానిక సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా మారాలిడ స్వయం ప్రతిపత్తి, స్వావలంబనతో ముందుకు సాగాలిడ పల్లెలు జాతీయ సమగ్రత, సుస్థిరతకు మూల కేంద్రాలు కావాలిడ ఇవీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు నిర్దేశించుకున్న లక్ష్యాలు. గత ప్రభుత్వ విధానాలతో పూర్తిగా నిర్వీర్యం అయిన పంచాయతీరాజ్ వ్యవస్థకు పునరుజ్జీవం పోస్తూ,**మిగతా 2లో...**



# పెట్టుబడులు పెట్టండి

**సింగపూర్ పారిశ్రామికవేత్తలకు మంత్రుల ఆహ్వానం**

**మూడో రోజు పర్యటనలో పారిశ్రామికాభివృద్ధి, పోర్టుల ఆధునికీకరణ అంశాలపై అధ్యయనం**

**ఎస్‌బీఎఫ్ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం**

**(అమరావతిఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::** సింగపూర్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రుల బృందం మూడో రోజు గురువారం పలు కీలక అంశాలపై అధ్యయనం చేసింది. సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్)**మిగతా 2లో...**

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

**మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం**

**ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం**

**నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ**





# భగ్గుమంటున్న ఏపీ..

**పలుచోట్ల 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**రాష్ట్రంలోని 151 మండలాలకు ఈదురుగాలుల హెచ్చరిక**

**62 మండలాల్లో తీవ్రమైన, 89 మండలాల్లో సాధారణ ఈదురుగాలుల సూచన**

# సమ్మెలో విషాదం

**వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం**

**ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శంకర్‌గౌడ్**

**పరిస్థితి విషమం.. కార్మికుల్లో తీవ్ర ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు కొనసాగిన సమ్మె**

**పోలీస్ భద్రత మధ్య 45శాతం బస్సులు రోడ్లపైకి..**

**నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో సమావేశం**



**హైదరాబాద్ ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::** ఆర్టీసీ కార్మికుల సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేశారు. బస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోలు పోసుకుని, నిప్పంటించుకున్నారు. ప్రయాణికులు,**మిగతా 2లో...**

# పోలింగ్ రికార్డు

తమిళనాడులో 234 స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా భారీసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తన కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కు వినియోగించు కున్నారు. ప్రముఖ సినీ నటులు రజనీకాంత్, ఎంఎన్ఎం అధినేత, నటులు కమలహాసన్, టివికె అధినేత విజరు తదితరులు ఓటు వేశారు.

**పశ్చిమబెంగాల్‌లో అక్కడక్కడ ఉద్రిక్తతలు**

పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ముర్షిదాబాద్‌లో టిఎంసి కార్యకర్తలకు, ఎయుజెపి వ్యవస్థాపకుడు హుమాయున్ కబీర్‌కు మధ్య ఘర్షణ జరిగింది. సిలిగురిలో టిఎంసి, బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్టు సమాచారం. కుమార్‌గంజ్‌లో తన పోలింగ్ ఏజెంట్లను పలు బూత్‌ల నుంచి తొలగించారని బిజెపి అభ్యర్థి సువేందు సర్కార్ ఆరోపించారు. తనపై దాడి జరిగిందని కూడా ఆయన పేర్కొన్నారు.

**తమిళనాడులో ప్రశాంతం**

తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలువురు ప్రముఖులు, ప్రముఖ రాజకీయ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

లైవ్ వెబ్ కాస్టింగ్‌లో పరిశీలన : ఇసి

లైవ్ వెబ్‌కాస్టింగ్‌లో రెండు రాష్ట్రాల్లోని అన్ని పోలింగ్ బూత్‌లను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ ఎస్ఎస్ సంధు, డాక్టర్ వివేక్ జోషి పరిశీలించినట్లు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.



**ఉప ఎన్నికల్లో**

గుజరాత్‌లోని ఉమ్రెత్ 3 ఉప ఎన్నికల్లో 59.03, మహారాష్ట్రలోని బారామతి -201లో 57.48, రాహురి -223లో 55.31 శాతం పోలింగ్ నమోదైనట్లు ఇసి ప్రకటించింది.

# గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు

**మొదటిపేజీ తరువాయి**

ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తామని.. అన్ని బస్సులను ఏసీ బస్సులుగా మారుస్తామని చెప్పారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లా చేస్తామని అన్నారు. ఈ జిల్లాను అదృష్టం వరించిందని.. భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అనకాపల్లి నంబర్‌వన్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అదరగొడుతోందని, దేశంలోనే నంబర్ వన్ జిల్లాగా తయారవుతుందని తెలిపారు. రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ నిర్మిస్తున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇటీవలే రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ కంపెనీకి శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. అత్యంత వెనుకబడిన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా దేశంలో ధనిక జిల్లాగా మారింది. ఇప్పటికే విశాఖలో పూర్తిగా పరిశ్రమలు వచ్చాయి. ఇకపై ఏ పెట్టుబడులు వచ్చినా అనకాపల్లి జిల్లాకే వస్తాయి. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా చేసే బాధ్యత నాది. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాంబిల్లిలోని సోలార్ ఇన్‌ఫూట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుంది. ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ కలల సాకారానికి ఇదే నిదర్శనం అన్నారు. ఇటీవలే ఆర్సెలార్ స్టీల్ కంపెనీ వచ్చిందన్నారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని.. ఇక ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదని సీఎం అన్నారు. ఉద్యోగాల కోసం ఏపీకి రావాల్సిన పరిస్థితి తీసుకొస్తామని తెలిపారు. ఏడాదిలోగా ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు తీసుకొస్తామన్నారు. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు. వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతే జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. 2019-24 మధ్య ఏపీలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని వైసీపీ కుప్పకూల్చిందని మండిపడ్డారు. జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచారని.. ఉచితంగా కరెంట్ వచ్చే సోలార్‌ను వినియోగించుకోలేదన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.12 వేల కోట్ల భారం మోపారన్నారు. వైసీపీ హయాంలో పరిశ్రమలు వెనక్కిపోయాయని సీఎం అన్నారు. సొంత బాబాయ్‌నే చంపిన చిల్లర పార్టీ వైసీపీ అంటూ మండిపడ్డారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని చెప్పారని.. పోస్టుమార్టం తర్వాత గొడ్డలిపోటుగా తేలిందన్నారు. వాళ్లే నేరం చేసి.. ఆ పాపాన్ని తమపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనం నేరస్తులతో రాజకీయం చేస్తున్నాం' అని సీఎం వ్యాఖ్యానించారు. 'ఏపీ పునర్‌నిర్మాణం చేస్తామని చెప్పాం.. చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలు తమపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పామన్నారు. తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి జరగాలని.. సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులే కరెంట్ ఉత్పత్తి చేసుకునే పరిస్థితి రావాలని చెప్పుకొచ్చారు. రెండుమూడేళ్లలో 40 లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్ కరెంట్ అందిస్తామని అన్నారు. భవిష్యత్తులో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏపీకి ఇప్పటికే రూ.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని.. 22 నెలల్లో 800కి పైగా ప్రాజెక్టులు వచ్చాయని సీఎం తెలిపారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు ఉచితంగా ఇస్తామని తెలిపారు. 'ప్రతి ఇంటిపై సోలార్ అమర్చుకోండి.. రాయితీ ఇస్తాం' అని ప్రకటించారు. 23 లక్షల మంది రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, 22 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రూ.4 వేల కోట్లకుపైగా ట్రూడౌన్ ఛార్జీల భారం తగ్గించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2000లోనే విద్యుత్ రంగ సంస్కరణలు మొదలుపెట్టాం. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ రంగం కుప్పకూలింది. ఉచిత సోలార్ కరెంటు వాడకుండా రూ.9వేల కోట్లు చెల్లించారు. విద్యుత్ సంస్థలపై రూ.1.12 లక్షల కోట్లు భారం మోపారు. విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారం మోపారు. కేంద్రం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా సాగుతుంటే.. ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తోంది. గ్రీన్ ఎనర్జీ వల్ల రూ.10 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయి. 22 నెలల వ్యవధిలో 117 ప్రాజెక్టులు క్లియర్ చేశాం. రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం 4.76 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే 160 గిగావాట్లలో 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ తయారీకి అనుమతులు మంజూరు చేశాం. గ్రీన్ ఎనర్జీలో ఎన్టీపీసీ రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు పెట్టబోతోంది. వచ్చే ఏడాది ఈ పనులు కూడా ప్రారంభమవుతాయి. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నాం. వెయ్యికిపైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. త్వరలో మరో 444 ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయి. మూడేళ్లలో 5 వేలకుపైగా ఛార్జింగ్ స్టేషన్లు వస్తాయి. రాబోయే రోజుల్లో ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్‌వే వస్తాయని చంద్రబాబు అన్నారు.

# సమ్మెలో విషాదం

**మొదటిపేజీ తరువాయి**

కార్మికులు వెంటనే మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. శంకర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నల్లగొండ, ఖమ్మంలలో మరో ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లు కూడా ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ వరుస పరిణామాలతో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. మరోవైపు సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగింది. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను నియమించడం, పోలీసులతో భద్రత ఏర్పాటు చేయడంతో గురువారం 45శాతం వరకు బస్సులు నడిచాయి. కాగా, రెండో రోజు సమ్మెలో ఊహించని పరిణామాలు చోటు చేసుకోవడంతో సమ్మె తదుపరి కార్యరూపం ఎలా ఉంటుందోననే అంశంపై నిఘా వర్గాలు రంగంలోకి దిగినట్టు సమాచారం. బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రైవేటు వాహనాల దోపిడీ కొనసాగింది. రెండింతలకుపైగానే చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆందోళన..**

రాష్ట్రవ్యాప్తంగా గురువారం కూడా ఆర్టీసీ జేఏసీ సమ్మె కొనసాగింది. కార్మికులు విధులు బహిష్కరించి డిపోల ముందు, బస్‌స్టేషన్లలో నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. బస్సులు బయటికి రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. పలుచోట్ల సమ్మెలో పాల్గొంటున్న ఆర్టీసీ కార్మికులకు టెంట్లు, సామగ్రి సరఫరా చేయవద్దంటూ స్థానిక పోలీస్ స్టేషన్ల నుంచి టెంట్‌హౌస్‌ల నిర్వహకులకు ఆదేశాలు వెళ్లాయి. పలుచోట్ల వేసిన టెంట్లను కూడా తొలగించారు. దీనితో ఆర్టీసీ కార్మికులు ఎండలోనే ఆందోళనలు కొనసాగించారు. తమ సమ్మెకు అడ్డుపడొద్దని కోరుతూ కొన్నిచోట్ల కార్మికులు పోలీసు అధికారుల కాళ్లు పట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఒక తాత్కాలిక డ్రైవర్ బస్సును డిపో నుంచి బయటికి తీస్తుండగా.. ఇద్దరు మహిళా కండక్టర్లు మంజుల, సునీత బస్సుపై కారం చల్లారు. దీనిపై డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



**45శాతం బస్సులు రోడ్లపైకి!**

ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముమ్మరం చేశాయి. డిపోలు, బస్టాండ్ల వద్ద పోలీసులను మోహరించారు. బస్సుల్లోనూ పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్లను నియమించారు. ఈ క్రమంలో గురువారం సుమారు 45శాతం బస్సులు రోడ్డెక్కాయని అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులు 98శాతం, అద్దె బస్సులు 95శాతం, ఆర్టీసీ బస్సులు 15శాతం నడిచాయని తెలిపారు. నారాయణపేట్, సిద్దిపేటలలో మాత్రం బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఇక సమ్మె కొనసాగుతున్న విషయం తెలిసిన జనం చాలా వరకు ప్రయాణాలు మానుకున్నారు. అత్యవసరమైన వారు, ముందే ఇతర ప్రాంతాలకు వెళ్లి చిక్కుకున్నవారు మాత్రం బస్టాండ్లకు వచ్చారు. దీంతో ప్రధాన బస్టాండ్లు బోసిపోయి కనిపించాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో బస్సుల్లో కండక్టర్లు లేకపోవడంతో మహిళలతోపాటు పురుషులూ ఉచితంగానే ప్రయాణించారు.

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

**కోల్‌కతా,ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::**

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఏ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝల్మురిని కూడా అందజేస్తారు. ఝల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

**మొదటిపేజీ తరువాయి**

'హార్మూజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా సరే కాల్చి ధ్వంసం చేయాలని నావికా దళాన్ని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తున్నాను" అని పేర్కొన్నారు. అంతేకాకుండా హార్మూజ్ జలసంధి తమ ఆధీనంలోనే ఉందని ప్రకటించారు. నౌకల రాకపోకలు అమెరికా నేవీ అనుమతి తోనే జరుగుతాయని ట్రంప్ రాసుకొచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తేల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోందన్నారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు జరగవన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి వచ్చేంతవరకు నిర్బంధం కొనసాగుతుందని తెలిపారు

అయితే కొద్ది రోజుల క్రితం ఆయనే స్వయంగా కాల్పుల విరమణను పొడిగిస్తూ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాని ట్రంప్ నుండే దాడి చేయలంటూ ఆదేశాలు రావడం గమనార్హం. మరోవైపు అమెరికా నిర్బంధం కొనసాగుతున్నంత కాలం హార్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ యుద్ధంతో హార్మూజ్ జలసంధి ఉద్రిక్త ప్రాంతంగా మారిపోయింది. అలాగే ఇరాన్ సముద్రంలో అమర్చిన సిమైన్స్ తీయడం అంత సులభం కాదని, వాటిని తీసేందుకు కనీసం 6 నెలల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే 35 కి.మీ వెడల్పు ఉండే హార్మూజ్ జలసంధి కోసం అగ్రరాజ్యం అల్లాడిపోవడం, అనేక దేశాల్లో చమురు ధరలుపై ప్రభావం పడటం ఈ జలసంధి ప్రాముఖ్యతను తెలుపుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు..

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం..**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం అవుతుందని ఎస్‌పి గ్లోబల్ పర్చేజింగ్ సంస్థ గురువారం నివేధించింది. ఉత్పత్తి వ్యయాలు భారీగా పెరిగిపోతున్నాయని, సేవా రంగంలో కూడా కార్యకలాపాలు మందగించాయని ఈ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఇంధన సరఫరాలకు ఎదురైన అత్యంత తీవ్రమైన ఆటంకాలను అధిక భాగం తట్టుకున్నప్పటికీ, దాదాపు రెండు నెలలనుండి కొనసాగుతున్న యుద్ధంతో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది, ఆహార సరఫరాలపై ప్రభావం, ఆర్థిక వృద్ధి మందగించడానికి కారణాలు నివేదిక విశ్లేషించింది. యూరో జోన్‌లోని 21 దేశాలు అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న వాటిలో ఉన్నాయని, దీనికి సంబంధించిన అభివృద్ధి సూచిక మార్చిలో 50.7 శాతం నుండి ఏప్రిల్‌లో 48.6 శాతానికి పడిపోయిందని తెలిపింది.

# భగ్గుమంటున్న ఏపీ..

**పలుచోట్ల 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)::**

ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఓవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాష్ట్రంలోని 62 మండలాల్లో తీవ్రమైన ఈదురుగాలులు, మరో 89 మండలాల్లో సాధారణ ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. దీనికి అదనంగా మరో 7 మండలాల్లో తీవ్రమైన, 31 మండలాల్లో సాధారణ గాలులు కూడా నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఆశ్రయం పొందవద్దని సూచించారు.మరోవైపు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. గురువారం పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో అత్యధికంగా 45.4 డిగ్రీల సెల్సియస్, కడపలో 45.1, మన్యం జిల్లా సాలూరులో 45.1, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ విపరీత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు

# పల్లెల్లో పవన్ మార్క్

**మొదటిపేజీ తరువాయి**

కీలక సంస్కరణలతో పాటు పలు రకాల పథకాలకు శ్రీకారం చుట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. జగన్ ఐదేళ్ల పాలనలో కేంద్ర అధికారులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను లెక్కచేసేవారు కాదు. నిధులు విడుదల చేసేవారు కాదు. అయితే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ శాఖ పగ్గాలు చేపట్టాక.. సమర్థులైన అధికారులు, సిబ్బందితో సత్ఫలితాలు సాధిస్తున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను రాబడుతున్నారు. సుమారు పది అంశాల్లో ఈ శాఖ ఇప్పుడు దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. 2025- 26 సంవత్సరానికి సంబంధించి రెండు కేటగిరీల కింద రాష్ట్రానికి 5 అవార్డులు దక్కాయి. స్థానికంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేస్తున్న 5 పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతాత్ వికాస్ పురస్కార్(లను కేంద్రం ప్రకటించింది. మహిళా స్నేహపూర్వక పంచాయతీగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలెం గ్రామానికి మొదటి ర్యాంకు.. పేదరిక నిర్మూలన-జీవనోపాధి పెంపు కేటగిరీలో కడప జిల్లా ఖాజీపేట మండలం చెమ్ముళ్లపల్లి గ్రామ పంచాయతీకి రెండో ర్యాంకు.. మౌలిక వసతుల స్వీయ అభివృద్ధి కేటగిరీ కింద ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం గుండమల గ్రామ పంచాయతీకి మూడో ర్యాంకు.. అదే విధంగా మండల స్థాయిలో చిత్తూరు జిల్లా కుప్పం మండలానికి అవార్డు దక్కింది. ఈ పంచాయతీలకు రూ.4.75 కోట్ల నగదు బహుమతి కూడా అందించనున్నట్లు కేంద్రం సమాచారం అందించింది.

# పెట్టుబడులు పెట్టండి

**మొదటిపేజీ తరువాయి**

ప్రతినిధులతో సమావేశమైన మంత్రులు.. రాష్ట్రంలో అవలంభిస్తున్న పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై వివరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. మరోవైపు ఏపీలో పారిశ్రామికాభివృద్ధి, పోర్టుల ఆధునికీకరణ, స్మార్ట్ ఎస్టేట్‌ల నిర్మాణం లక్ష్యంలో భాగంగా మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, అనిత, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్‌లు పలు కీలక సంస్థలను సందర్శించారు. మొదట ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీని మంత్రులు సందర్శించారు. అక్కడి పోర్టు కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 2040 నాటికి ప్రపంచంలోనే అతి పెద్ద, పూర్తిస్థాయి ఆటోమేటెడ్ టెర్మినల్‌గా అవతరించనున్న టువాస్ పోర్ట్ పనితీరు, అక్కడ వినియోగిస్తున్న సాంకేతికత గురించి తెలుసుకున్నారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో కృత్రిమ మేధ, స్మార్ట్ వ్యవస్థలను అనుసంధానం చేయడం ద్వారా సమయాన్ని, ఖర్చును ఎలా ఆదా చేస్తున్నారో మంత్రుల బృందం అధ్యయనం చేసింది. సింగపూర్‌లో పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే ప్రభుత్వ సంస్థ జేటీసీ కార్పొరేషన్‌ను కూడా మంత్రులు సందర్శించారు. పారిశ్రామిక వాడల అభివృద్ధి, ఆధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ ఎస్టేట్‌ల నిర్మాణం, పర్యావరణ అనుకూల గ్రీన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడంలో జేటీసీ కీలక పాత్ర పోషించింది. భూమి కొరత ఉన్న సింగపూర్‌లో చమురు నిల్వ కోసం భూగర్భంలో నిర్మించిన జురాంగ్ కేవర్న్ మంత్రుల బృందాన్ని ఆకర్షించింది. ఏపీలోని తీర ప్రాంతాల్లో ఇలాంటి వినూత్న స్టోరేజ్ పద్ధతులపై మంత్రులు చర్చించారు. నెట్‌జీరో ఉద్గారాల లక్ష్యంతో చేపడుతున్న గ్రీన్ ప్రాజెక్టుల అమలు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కాగా, పర్యటనలో భాగంగా సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) ప్రతినిధులతో మంత్రులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలను వివరించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకువస్తున్న కొత్త పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి తెలియజేశారు. రాజధాని అమరావతితో పాటు గ్రీన్ ఎనర్జీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రసక్తే లేదు: కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

వంటి అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోతాయని, ఆ తరువాతనే ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్ల వంతున పెరిగిన దాని బట్టి పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.25 నుంచి రూ. 28 వరకు పెరుగుతాయని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక వెల్లడించింది. అలాంటి నివేదికలు పౌరుల్లో భయాందోళనలు సృష్టించడానికే డిజైన్ చేశారని మంత్రిత్వశాఖ పేర్కొంది. వాస్తవానికి గత నాలుగేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేని దేశం భారత్ ఒకటేనని వెల్లడించింది. ప్రజలపై ధరాభారం పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వరంగ చమురు సంస్థలు నిరంతరం అనేక చర్యలు తీసుకుంటున్నాయని వివరించింది.

# మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి ఉపేక్షలు ఉండవు

**మహిళల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యత -జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్**

**మహిళలు, చిన్నారుల భద్రతపై విస్తృత అవగాహన సదస్సు -భారీ బైకు ర్యాలీ పాల్గొన్న జిల్లా ఎస్పీ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే**





**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 23,కళ్యాణదుర్గం/అనంతపురం**

కళ్యాణదుర్గం పట్టణంలోని గోవిందరాజులు కళ్యాణ మండపంలో గురువారం మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐ పి ఎస్ ,ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

### అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, యాప్‌లకు దూరంగా ఉండాలి

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న వివిధ నేరాల నేపథ్యంలో మహిళలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళల భద్రతకు సంబంధించి ప్రభుత్వం, పోలీసుశాఖలు అమలు చేస్తున్న పలు కీలక సేవలను పరిచయం చేశారు. ముఖ్యంగా శక్తి యాప్, స్త్రీ రక్ష పోర్టల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం పొందే విధానాన్ని వివరించారు. ఈ యాప్‌లు మహిళలకు రక్షణగా నిలుస్తాయని, ప్రతి మహిళ వీటిని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా.... ప్రేమ వివాహాల పేరుతో జరిగే మోసాలు, బాల్య వివాహాల దుష్ప్రభావాలు, పోక్సో చట్టం గురించి సవివరంగా అవగాహన కల్పించారు. చిన్నారులపై జరిగే నేరాలకు ఈ చట్టం కఠినంగా అమలవుతుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో డిజిటల్ అరెస్ట్ మోసాలు, లోన్ యాప్ మోసాలు వంటి అంశాలపై కూడా ఎస్పీ వివరించారు. గత ఏడాది జిల్లాలో అన్ని రకాల చోరీలలో రూ. 5 కోట్లు సొత్తులు పోగొట్టుకోగా అదే సైబర్ నేరాలలో రూ. 61 కోట్లు పోగొట్టుకోవడం చూస్తే సైబర్ నేరస్తుల మోసాలు ఎలా జరుగుతున్నాయో అవగతమౌతోందన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, యాప్‌లకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.గంజాయి, తదితర మాదక ద్రవ్యాల కట్టడికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. గంజాయి వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణా, సాగు లు సమాచారం తెలిస్తే ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు చేరవేయాలన్నారు.

### అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీసులను ఆశ్రయించాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా ధైర్యంగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు గురిచేసినా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అంతకు మునుపు జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐ పి ఎస్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు






ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పోలీసులు, స్థానికులు, తదితరులు బైకు ర్యాలీ నిర్వహించారు. అర్బన్ పోలీసు స్టేషన్ నుండీ వాల్మీకి సర్కిల్ , టీ సర్కిల్ ల మీదుగా గోవిందరాజుల ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ కొనసాగింది
ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవిబాబు, మహబూబ్ బాషా, పలువురు సి.ఐ లు, ఎస్సైలు మరియు స్థానిక ప్రజలు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి..

**కౌలు రైతు సంఘం నాయకుడు యూసుఫ్ భాష**

**దేవనకొండ ఏప్రిల్ 23 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

కౌలు రైతులకు వెంటనే ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు కౌలు రైతులకు అమలు చేయాలని కౌలు రైతు సంఘం మండల నాయకులు యూసుఫ్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు...ఈ మేరకు గురువారం నాడు పత్రిక ప్రకటన చేస్తూ కౌలు రైతుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని కౌలు రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు.. కౌలు రైతులు గుర్తింపు కార్డు ద్వారా వివిధ సంక్షేమ పథకాల అర్హులు అవుతారని కావున గుర్తింపు కార్డులు వెంటనే అర్హులైన వారందరికీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు అన్నదాత సుఖీభవ ,పంట నష్ట పరిహారం, బ్యాంకుల్లో రుణాలు పంటల బీమా తదితర సంక్షేమ పథకాలు కౌలు రైతులకు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు...




## "బీసీ గళం" బహిరంగ సభను విజయవంతం చేయాలి

**వైయస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి**

**అనంతపురం ప్రతినిధి, ఏప్రిల్ 23,(రిపబ్లిక్ న్యూస్ ):**



కూటమి ప్రభుత్వంలో బీసీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న అనంతపురం నగరంలోని లలితకళా పరిషత్ లో నిర్వహించనున్న "బీసీ గళం" బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బీసీ గళం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైయస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ , ఇతర బీసీ నాయకులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పథకాలు నిలిచిపోయాయని, ఉపాధి అవకాశాలు తగ్గాయని, విద్య, సంక్షేమ రంగాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.బీసీ వర్గాల హక్కుల కోసం గళమెత్తే వేదికగా ఈ "బీసీ గళం" సభ నిలవనుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ బహిరంగ సభలో బీసీ వర్గాల సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వబడుతుందని తెలిపారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**లక్ష్య సాధనకు భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి -జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురము సంక్షేమం, ఏప్రిల్ 23,(రిపబ్లిక్ న్యూస్ ):**



లక్ష్య నిర్దేశంతో సాధన దిశగా చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని, దివి నుండి భువికి గంగను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల అసామాన్యమని, స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు.గురువారం ఉదయం అనంతపురము నగరంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ సర్కిల్ సమీపంలోని భగీరథ మహర్షి విగ్రహం వద్ద బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పూజలు నిర్వహించి, భగీరథ మహర్షి విగ్రహానికి పూల మాలలు సమర్పించారు.

**మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంగను దివి నుంచి భువికి ఎంతో పట్టుదలతో తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని, అందుకే ఆయన అపర భగీరథుడు అని అన్నారు. ఆ మహనీయుడిని స్మరించుకోవడం, జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. మహనీయుల గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలన్న సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహా మహర్షి వేడుకలను రాష్ట్ర వేడుకగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. లక్ష్య నిర్దేశంతో సాధన దిశగా చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని, దివి నుండి భువికి గంగను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిణి ఆఫీసర్ కుష్బూ కొఠారి, సహాయ సంక్షేమ అధికారులు, సిబ్బంది, పలువురు బీసీ సంఘాల నాయకులు తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలి..

**అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి.. అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని దేవనకొండ తాసిల్దార్ కు వినతి పత్రం..**





**దేవనకొండ ఏప్రిల్ 23 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**

అంగన్వాడీలకు మే నెల మొత్తం సెలవులు ప్రకటించాలని, అంగన్వాడీల వేతనాలు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు జ్యోతి, విజయలక్ష్మి, సజీవమ్మ లు డిమాండ్ చేశారు. గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో దేవనకొండ తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి తాసిల్దార్ కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడి ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్వాడీలు తమ జీతాల పెంపు కోసం అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించిన ఎలాంటి చర్యలు లేవన్నారు. మే నెల మొత్తం అంగన్వాడీలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్స్ కు సంబంధించిన జీవో నెంబర్ 5 ను వెంటనే సవరించాలని తెలిపారు. మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్న పెండింగ్లో ఉన్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు.. నాగలక్ష్మి,శారద, వరలక్ష్మి, లలితాంబ, చిట్టెమ్మ, రుతమ్మ, నిరీక్షణ, ఉరుకుందమ్మ, వనిత, హైమావతి, రాజేశ్వరి, మహేశ్వరి, నీలావతి, శిరీష, వెంకటలక్ష్మి, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల చెల్లింపునకు పెరుగుతున్న రద్దీ

**రూ.16.86 కోట్ల వసూళ్లు దాటాయి - ముందస్తు చెల్లింపులపై 5% రాయితీకి ప్రజల స్పందన**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)**



నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపులకు ప్రజలు పెద్దఎత్తున ముందుకు వస్తుండటంతో కార్యాలయాలు, ప్రత్యేక కౌంటర్ల వద్ద రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వం ప్రకటించిన రాయితీల పట్ల నగర ప్రజల్లో అవగాహన పెరగడం దీనికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.
ఇప్పటివరకు రూ.16.86 కోట్లకు పైగా పన్నులు వసూలైనట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ముందుగానే చెల్లించే వారికి 5 శాతం రాయితీ, బకాయిలను ఏకమొత్తంగా చెల్లించే వారికి 50 శాతం వడ్డీ రాయితీ కల్పించడం వల్ల పన్నుదారులు ఈ అవకాశాన్ని విస్తృతంగా వినియోగించుకుంటున్నారు.
నగరపాలక సంస్థ నూతన, పాత కార్యాలయాలతో పాటు వివిధ వార్డు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు సులభంగా పన్నులు చెల్లిస్తున్నారు.ఆస్తిపన్ను రాయితీల గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ఇంకా చెల్లించని వారు వెంటనే వినియోగించుకోవాలని కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పన్నులు సకాలంలో చెల్లించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఏఐ' వైద్య సేవలకు మంచి ఫలితాలు

**ఉత్తమ అంకుర సంస్థకు రూ.కోటి వర్క్ ఆర్డర్**

**మరో 12 సంస్థలకు నగదు ప్రోత్సాహకాలు**

**18 ఆసుపత్రుల్లో ప్రయోగాత్మకంగా ఏఐ సేవలు**

**త్వరలో ఫలితాలపై ప్రత్యేక సదస్సు**

**అమరావతి ప్రతినిధి, ఏప్రిల్ 23,( రిపబ్లిక్ న్యూస్ ):**



రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత వైద్య సేవలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా 18 ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంకుర సంస్థల సహకారంతో అమలు చేసిన ఈ సేవలు రోగుల చికిత్సలో మెరుగైన ఫలితాలను చూపించాయని వెల్లడించారు.వైద్య సేవల పనితీరు ఆధారంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంకుర సంస్థలను ఎంపిక చేసి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మొత్తం 12 సంస్థలకు రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున రూ.40 లక్షలు అందించనుంది. అత్యుత్తమ సంస్థకు రూ.కోటి విలువైన 'వర్క్ ఆర్డర్' ఇవ్వనున్నారు.'ఏపీ మెడ్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్'కు 297 దరఖాస్తులు రాగా, మూడు దశల పరిశీలన అనంతరం 18 అంకుర సంస్థలను ఎంపిక చేశారు. డయాగ్నస్టిక్స్, పోర్టబుల్ కేర్, స్మార్ట్ మానిటరింగ్, టెలీమెడిసిన్ విభాగాల్లో ఈ సంస్థలు సేవలు అందించాయి. దేశంలో తొలిసారిగా ఏకకాలంలో 18 అంకుర సంస్థల సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు చేయడం విశేషమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని తెలిపారు.
ఫిబ్రవరి నుంచి మార్చి వరకు 37 రోజుల్లో 12,677 మంది రోగులకు సేవలు అందించగా, అనేక ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. టీబీ, క్యాన్సర్, కంటి సమస్యలు, గుండె జబ్బులు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించగలిగారు. అలాగే ఏఐ స్క్రైబ్ వినియోగంతో వైద్యులకు 70 శాతం వరకు సమయం ఆదా అయినట్లు తెలిపారు.ఈ ప్రాజెక్ట్ ఫలితాలపై సమగ్ర నివేదికను కమిటీ ఫర్ అప్లైడ్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్ పరిశీలించనుంది. అనంతరం ఉత్తమ సంస్థలను ఎంపిక చేస్తారు.ఏఐ ఆధారిత వైద్య సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం 'ఛాలెంజ్' విధానాన్ని కొనసాగించనుంది. ఈ ఆవిష్కరణల వివరాలను వెల్లడించేందుకు అమరావతిలో త్వరలో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు.

# నంద్యాల పెద్ద చెరువు అభివృద్ధికి కార్యాచరణ ప్రారంభం

**త్వరలో ప్రజలకు 2.5 కి.మీ. వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి**

**గ్రీనరీ, పగోడాలతో చెరువు సుందరీకరణ**

**కట్ట రక్షణకు ఫెన్సింగ్, బౌండరీ ఏర్పాటు**

**700 ఎకరాల చెరువు నంద్యాలకు కీలక ఆస్తి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 23 రిపబ్లిక్ న్యూస్**
నంద్యాల పట్టణంలోని పెద్ద చెరువును సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం వాటర్ రిసోర్సెస్ శాఖ అధికారులతో కలిసి చెరువు పరిసరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చెరువు చుట్టూ సుమారు 2.5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ట్రాక్‌ను సౌకర్యవంతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు పరిసరాల్లో గ్రీనరీని పెంపొందిస్తూ, షేడ్ పగోడాలు ఏర్పాటు చేసి అందమైన వాతావరణాన్ని సృష్టించేందుకు బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కలిగించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. చెరువు కట్టను ఆక్రమణల నుంచి రక్షించేందుకు బౌండరీ ఫిక్సింగ్, ఫెన్సింగ్, ట్రెంచెస్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కట్టను శాశ్వతంగా సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే సివిల్ పనులను పూర్తి చేసి, వర్షాలు ప్రారంభమైన వెంటనే విస్తృతంగా మొక్కలు నాటి గ్రీనరీని పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పాలేరు వాగు, చామ కాలువలతో అనుసంధానమై సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పెద్ద చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తే, నంద్యాల పట్టణానికి ఒక విలువైన ఆస్తిగా మారుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శివ శంకర్ రెడ్డి, కేసీ కెనాల్ డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి జయంతి



**గుత్తి ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణంలోని సూర్యవంశం వడ్డెరాజు సంఘం ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు లక్ష్మీదేవి చిరంజీవి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యమని, గంగను భూమికి తెచ్చిన భగీరథ మహర్షి జీవితం అందరికీ స్ఫూర్తిదాయం మహనీయుల ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిరంజీవి. ఓసిసిఐ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఓసిసిఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ బత్తల మారుతిప్రసాద్, వెంకటరాముడు, నాగరాజు,వెంకటేష్,వెంకటరాముడు,మునేష్,సాయి, కుమార్,హనుమంతు,హరి, రమేష్, అంకన్న పాల్గొన్నారు.

# ఘనంగా భగీరథ జయంతి వేడుకలు



**కళ్యాణదుర్గం సంక్షేమం,ఏప్రిల్ 23,(రిపబ్లిక్ న్యూస్ ):**
భగీరథ మహర్షి జయంతి వేడుకలను కళ్యాణదుర్గం వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ పార్లమెంట్ సభ్యులు, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**జల ప్రదాతగా నిలిచిన మహనీయుడు భగీరథ మహర్షి**

అనంతరం డాక్టర్ తలారి రంగయ్య మాట్లాడుతూ.. గంగా నదిని భూమికి తీసుకువచ్చి లోకానికి జల ప్రదాతగా నిలిచిన మహనీయుడు భగీరథ మహర్షి అని కొనియాడారు. అసాధ్యమైన పనిని సైతం పట్టుదలతో సుసాధ్యం చేయవచ్చని ఆయన జీవితం నిరూపించిందని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం రూరల్, శెట్టూరు, బ్రహ్మసముద్రం కన్వీనర్లు గోళ్ళ సూరి, ఎమ్ ఎస్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు యాదవ్, మునిసిపల్ విభాగం అధ్యక్షులు దొడగట్ట మురళి, వికలాంగుల విభాగం అధ్యక్షులు పాతలింగ, ఎంపీటీసీ భాస్కర్, మల్లి, ముచ్చర్లపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం


**జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్, 23 (రిపబ్లిక్ న్యూస్)**
భగీరథ మహర్షి పట్టుదల నుండి అందరూ స్ఫూర్తి పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ కలెక్టర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని భగీరథ చిత్రపటానికి డిఆర్ఓ, సగర ఉప్పర సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సగర (ఉప్పర) వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్ కుమార్ ఉప్పరి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గోవర్ధన్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు, హాస్టల్ వార్డెన్ ఇంచార్జ్ డి.మునిరాజు, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ షబ్బీర్, నంద్యాల అసెంబ్లీ సంఘం అధ్యక్షుడు బి.బాలాజీ, యువజన సంఘం అధ్యక్షుడు యు.హరికిరన్, డా.గురు ప్రసాద్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ భగీరథ మహర్షి గంగను భూమిపైకి తీసుకువచ్చిన పట్టుదల, జల సంరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని, ఆయన త్యాగనిరతి ఆదర్శనీయమని కొనియాడారు. కఠోర శ్రమ చేసి దేనినైనా సాధించగలమని భగీరథ మహర్షి నిరూపించారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని యువత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. వెనుకబడిన తరగతుల వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపడుతున్న కార్యాచరణను పూర్తిస్థాయి ఫలాలు వారికి అందేలా నిరంతరం కృషి చేస్తామన్నారు. విద్యార్థులు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్



**గుత్తి ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి మండలం బసినేపల్లి తండా గ్రామానికి చెందిన బాలప్ప నాయక్ ఆహ్వానం మేరకు సత్యవతి, రమేష్ నాయక్, వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు,ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి, సుధాకర్ నాయుడు,మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరాంజనేయులు, మద్దిలేటి, గుత్తి మండలం టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ద

# మత్తు వ్యసనాల నిర్మూలనకు కర్నూలులో భారీ వాకథాన్

**"నషా ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా యువతలో అవగాహన**

**మాదకద్రవ్య రహిత జిల్లాగా కర్నూలును తీర్చిదిద్దడమే లక్ష్యం**




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)**
మత్తు వ్యసనాల నిర్మూలన లక్ష్యంగా కర్నూలు నగరంలో గురువారం భారీ వాకథాన్ నిర్వహించారు. "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ ద్వారా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించారు.
రాజ్ విహార్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సాగిన ఈ వాకథాన్‌ను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ""మత్తుపదార్థాలు వద్దు అని చెప్పండి", "మత్తుపదార్థ రహిత సమాజం వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.
ర్యాలీ సందర్భంగా మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై సందేశాలు అందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టీం టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ, యువతను మత్తు వ్యసనాల నుండి కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఆల్కహాల్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్నదని, దీని వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, వసతి గృహాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.
జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. అవగాహనతోనే ఈ సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమని, "నషా ముక్త్ భారత్ అభియాన్" లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.








# సాగునీటి ప్రాజెక్టులపై ఎంపీ నాగరాజు సమీక్ష

**పెండింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు**

**కీలక ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో చర్చ**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)**
జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి మరియు పెండింగ్ పనులపై బస్తిపాటి నాగరాజు ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ బాలచంద్ర రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ సుబ్బారాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శైలేశ్వర్ పాల్గొన్నారు.
సమీక్షలో భాగంగా వేదవతి, ఆర్డీఎస్, సుంకేసుల, గాజులదిన్నె, హెచ్.ఎన్.ఎస్.ఎస్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఎంపీ అధికారులతో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించిన లిఫ్ట్ ఇరిగేషన్ పంపుల ఏర్పాటు, గాజులదిన్నె ప్రాజెక్టు ఆధునికరణ పనులు, అలాగే దెబ్బతిన్న గేట్ల మరమ్మతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.
అదేవిధంగా వేదవతి, ఆర్డీఎస్, సుంకేసుల ప్రాజెక్టులకు సంబంధించిన పలు సాంకేతిక, పరిపాలనా అంశాలపై చర్చించిన ఎంపీ నాగరాజు, సాగునీటి ప్రాజెక్టులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు సమయానికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పాఠశాలలకు వేసవి సెలవులు

**గుత్తి ఏప్రిల్ 23( రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఈ సెలవులు జూన్ 11 వరకు కొనసాగి, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని గుత్తి మండల విద్యాశాఖ అధికారి రవి నాయక్ తెలిపారు. వేసవి కాలంలో విద్యార్థులకు దాదాపు 48 నుంచి 50 రోజులపాటు సుదీర్ఘ విరామం లభించనుంది. ఈ విరామాన్ని విద్యార్థులు సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. సెలవుల సమయంలో పాఠ్యాంశాల పునరావృతం, పుస్తక పఠనం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, క్రీడలు వంటి వాటిలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు.
అధిక ఎండల నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలని, చెరువులు, కాలువల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని విద్యాశాఖ అధికారులు సూచించారు



# కర్నూల్‌కొత్తకోట విద్యార్థి బస్సు మే 10 వరకు కొనసాగింపు

## విద్యార్థుల ఇబ్బందులపై కాంగ్రెస్ నేతల వినతి - ఆర్టీసీ ఆర్ఎం సానుకూల స్పందన

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)**
కర్నూల్ నుంచి కొత్తకోటకు నడుస్తున్న విద్యార్థి బస్సు సర్వీసును మే 10వ తేదీ వరకు కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ కోడుమూరు అసెంబ్లీ ఇంచార్జ్ అనంతరత్నం మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులతో కలిసి కర్నూల్ ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ, ప్రభుత్వం పాఠశాలలకు ఎండాకాల సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థి బస్సు సర్వీసులను నిలిపివేస్తామని ఆర్టీసీ అధికారులు ప్రకటించడంతో డిగ్రీ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. ఇంకా డిగ్రీ కళాశాలలకు సెలవులు ప్రకటించని పరిస్థితిలో బస్సు సర్వీసులు



నిలిపివేస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.అందువల్ల డిగ్రీ విద్యార్థులకు అధికారికంగా సెలవులు ప్రకటించే వరకు కర్నూల్‌కొత్తకోట విద్యార్థి బస్సు సర్వీసును కొనసాగించాలని ఆర్టీసీ అధికారులను కోరారు.ఈ విషయంపై స్పందించిన ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు, విద్యార్థుల సమస్యను పరిగణనలోకి తీసుకుని మే 10వ తేదీ వరకు బస్సు సర్వీసును



కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్ భాషా, 48వ వార్డ్ ఇంచార్జ్ షేక్ షబ్బీర్, 3వ వార్డ్ ఇంచార్జ్ జావిద్ భాష తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు అందుబాటులో శుద్ధ జలం.

**పాణ్యం,ప్రతినిధి ఏప్రిల్, 23 ప్రజా రిపబ్లిక్ న్యూస్.**
గ్రామీణ ప్రజలకు శుద్ధ జలం అందుబాటులో ఉండేలా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎండి మిద్దె శివరాం పేర్కొన్నారు. గురువారం కవులూరు గ్రామంలో రూ 10 లక్షలతో నిర్మించిన ఆర్ జి యం మినరల్ వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ధ్యేయంతో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ఇప్పటికే నంద్యాల జిల్లాలోని పలు గ్రామాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు తాగునీరు ఉచితంగా అంద చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్లాంటు నిర్మాణానికి స్థలం కేటాయించిన అంబేద్కర్ సేవా సమితి నాయకులు ఆయన అభినందించారు. ఆర్జియం విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు మద్దిలేటి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ం



# గ్రామ నీటి వనరుల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయండి

**ఆమోదం వెంటనే పనుల గ్రౌండింగ్‌కు ఆదేశాలు**
**ప్రతి మండలంలో ఉత్తమ కాస్కేడ్ చెరువు అభివృద్ధి లక్ష్యం**
**ఉదయం 6 గంటల నుంచే క్షేత్రస్థాయి తనిఖీలు**
**జియో ట్యాగింగ్ ఫోటోలతో పనుల నిర్ధారణ తప్పనిసరి**
**ప్రతి గ్రామంలో కనీసం రెండు పనులు ప్రారంభించాలి**
**సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ప్రగతిని తీసుకురండి**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్):**
జలధారజలహారతి కార్యక్రమం కింద నంద్యాల జిల్లాలో గ్రామ నీటి వనరుల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు వాటర్ రిసోర్స్ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, గ్రామీణ నీటి వనరుల సమగ్ర అభివృద్ధి, పనుల వేగవంతమైన అమలు మరియు క్షేత్రస్థాయి పర్యవేక్షణపై సంబంధిత అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. గ్రామ స్థాయి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసి, ఆమోదించిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆమె సూచించారు.

**గ్రామ నీటి వనరుల ప్రణాళికకు ప్రాధాన్యం**
ప్రతి గ్రామంలో ఉన్న చెరువులు, కుంటలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, వాటి నిల్వ సామర్థ్యాన్ని 'వార్స్' పోర్టల్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఫామ్ పాండ్స్, పర్కోలేషన్



ట్యాంక్స్ వంటి నీటి సంరక్షణ నిర్మాణాల సమాచారంతో పాటు భూగర్భ జలమట్టంలో వచ్చిన మార్పులను నమోదు చేసి, ఏపీ శాక్ మ్యాప్స్ ఆధారంగా సమగ్ర గ్రామ నీటి వనరుల ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ప్రణాళికలను శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని కలెక్టర్ గడువు విధించారు.

**పనుల గుర్తింపు - వెంటనే గ్రౌండింగ్**
ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాటర్ రిసోర్స్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లు సమన్వయంతో పనిచేసి కొత్త మరియు పునరుద్ధరణ పనులను గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి ఎంపీడీఓ లాగిన్‌కు పంపాలని తెలిపారు. కలెక్టర్ ఆమోదం పొందిన వెంటనే తదుపరి రోజే పనులు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. ఇతర జిల్లాలతో పోలిస్తే పనుల సంఖ్య తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**కాస్కేడ్ చెరువుల అభివృద్ధిపై దృష్టి**
ప్రతి మండలం, నియోజకవర్గంలో ఒక ఉత్తమ కాస్కేడ్ చెరువు అభివృద్ధి పనిని ఆదర్శంగా రూపొందించాలని సూచించారు. ఈ పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**క్షేత్రస్థాయి తనిఖీలు - కఠిన పర్యవేక్షణ**
అధికారులు ఉదయం 6 గంటల నుండే క్షేత్రస్థాయిలోకి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. జియో ట్యాగింగ్‌తో కూడిన ఫోటోలను ఎన్ ఆర్ జి ఎస్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసి పనులు ప్రారంభమైనట్లు నిర్ధారించాలన్నారు.

**పనుల అమలులో వేగం - సమీక్షా సమావేశాలు**
జిల్లాలో మంజూరైన పనులన్నీ త్వరితగతిన గ్రౌండింగ్ కావాలని, ప్రతి గ్రామంలో కనీసం రెండు పనులు ప్రారంభం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం మరియు సాయంత్రం ఫీల్డ్ విజిట్లు నిర్వహిస్తూ, సాయంత్రం 6:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనితీరును సమీక్షిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

**సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో మెరుగైన ప్రదర్శన అవసరం**
సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో జిల్లా వెనుకబడిన స్థానంలో వుందని, అందరూ సమన్వయంతో పని చేసి పనితీరును మెరుగుపరచాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో నీటి వనరుల సమర్థ వినియోగం, పనుల నాణ్యత మరియు వేగవంతమైన అమలుతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి

## జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్





**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 23 (రిపబ్లిక్ న్యూస్):**స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలి జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ పార్టీ ప్రతినిధి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రియాజ్ బాషా, బిఎస్పీ పార్టీ ప్రతినిధి శ్రీనివాసులు, టిడిపి పార్టీ ప్రతినిధి శివరాం రెడ్డి, వైఎస్సార్సీసీపీ పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... స్వచ్ఛమైన తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లు, మార్పులు, చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలని డిఆర్ఓ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. జిల్లాలో 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి ఎటువంటి అనుమానాలు, సందేహాలు ఉన్నట్లయితే తమ పరిధిలోని బిఎల్ఓ లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు.

# విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం

## కడప జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత

**కడప ప్రతినిధి,ఏప్రిల్ 23,( రిపబ్లిక్ న్యూస్ ):**
టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో తొండూరు బీసీ హాస్టల్ కు చెందిన విద్యార్థి దుర్మరణం పాలవ్వడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎంతో ఉజ్వల భవిష్యతు కలిగిన విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేంపల్లి మండల కేంద్రానికి చెందిన గురు ప్రణీత్ కుమార్(11) తొండూరు బీసీ హాస్టల్ ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. వేసవి సెలవులు ఇవ్వడంతో, అదే హాస్టల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య, తల్లితో కలిసి ఆటోలో సొంతూరు పయనమయ్యాడు. వాటర్ బాటిల్ కొని తిరిగి వస్తుండగా, టిప్పర్ లారీ గురు ప్రణీత్ కుమార్ ను ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో బాలుడి కుడికాలు నుజ్జునుజ్జయిందన్నారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖాధికారులు కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యమందించిన వైద్యులు మెరుగైన వైద్యం వెల్లూరులోని రాయల్ ఆసుపత్రికి తరలించాలని సూచించారన్నారు. వైద్యుల సూచన మేరకు అంబులెన్స్ లో తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థి పసి ప్రాయంలోనే మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. తల్లి, అన్నయ్య కళ్లేదుటే ఘోరం జరగడం మరింత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామన్నారు. విద్యార్థి మృతదేహానికి పోస్టు మార్టం చేయించి, బాధిత కుటుంబానికి వెన్నంటే ఉండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు. వేసవి సెలవులకు ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల వెంటే హాస్టళ్ల నుంచి బయటకు వెళ్లాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని, బస్సులు, ఇతర వాహనాలు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవి సెలవుల్లోనూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. హాస్టళ్ల సిబ్బంది కూడా విద్యార్థుల పట్ల కన్నేసి ఉంచాలని, తల్లిదండ్రులతోనే ఇళ్లకు పంపాలని మంత్రి సవిత స్పష్టం చేశారు.



# భగీరథ మహర్షి స్ఫూర్తితో జలధారజలహారతి కార్యక్రమాలు వేగవంతం

## భూగర్భ జలాల పెంపే లక్ష్యం నీటి సంరక్షణకు ప్రజల సహకారం అవసరం: కలెక్టర్ డా. ఏ. సిరి






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)**
భగీరథ మహర్షి స్ఫూర్తిని ఆచరణలోకి తీసుకువస్తూ కర్నూలు జిల్లాలో జలధారజలహారతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపు ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆమె వెల్లడించారు.
గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భగీరథ మహర్షి రాష్ట్రస్థాయి జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
కలెక్టర్ మాట్లాడుతూ భగీరథుని తపస్సు, పట్టుదల, సంకల్పం నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గంగను భూమిపైకి తెచ్చిన ఆయన కృషి నీటి విలువను గుర్తు చేస్తుందని చెప్పారు. జిల్లాలో నీటి వనరులు పరిమితంగా ఉన్నందున నీటి వినియోగంలో జాగ్రత్తలు అవసరమని సూచించారు.
వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే సుమారు 8000 హెక్టార్లలో సాగు చేపట్టినట్లు తెలిపారు. వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు.
జలధారజలహారతి కార్యక్రమాల ద్వారా చెరువులు, కుంటలు పూడికతీత, కాలువల శుభ్రపరిచే పనులు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 246 ఎంఐ చెరువులు, 435 కుంటలను పునరుద్ధరిస్తూ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు వివరించారు. చెరువులను అనుసంధానం చేసి నీటి వృథాను తగ్గించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొత్తం 3445 పనులు గుర్తించి అమలు చేస్తున్నామని చెప్పారు.
ఈ చర్యల వల్ల భూగర్భ జల మట్టం పెరిగి వేసవిలో నీటి సమస్య తగ్గుతుందని, భూగర్భ జలాలను 3 మీటర్ల మేర పెంచడమే లక్ష్యమని కలెక్టర్ వెల్లడించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కార్మికులను వినియోగిస్తూ పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.
ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా సహకరించాలని, ప్రకృతి సంపదలను కాపాడటం అందరి బాధ్యత అని కలెక్టర్ పిలుపునిచ్చారు.

**భగీరథుని తపస్సు నేటి తరానికి స్ఫూర్తి : ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి**
పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ భగీరథ మహర్షి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన సంకల్పం, తపస్సు సమాజ సేవకు ఆదర్శమని పేర్కొన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమని తెలిపారు.

**భగీరథుని సంకల్పం ఆదర్శం కావాలి : ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు**
పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ భగీరథుని పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని చెప్పారు. సమాజ అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

**మహిళా విద్యతోనే సమాజ అభివృద్ధి: గుడిసె కృష్ణమ్మ**
టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని చెప్పారు. విద్య ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.
బీసీల గౌరవం కోసం ప్రభుత్వ చర్యలు అభినందనీయం ఉప్పర సాగర సంఘం చైర్మన్ వెంకట రమణప్ప ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. సమాన అవకాశాలు కల్పించడం సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.







కార్యక్రమం అనంతరం బీసీ వసతి గృహాల విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన వారికి శాలువాలు, మెడల్స్ అందజేసి సన్మానించారు.

# మౌలాలి స్వామి పూజ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి



**కల్లూరు ప్రతినిధి, ఏప్రిల్ 23,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కల్లూరు మండలం పుసులూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ మౌలాలి స్వామి వారికి బస్తిపాడు గ్రామానికి చెందిన హరి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్ఆర్సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి స్వామి వారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు రామకృష్ణ రెడ్డి ,దండు లక్ష్మి కాంత రెడ్డి ,బస్తిపాడు కళ్ళ వెంకట రమణ రెడ్డి ,కర్నూలు యువజన విభాగం అధ్యక్షుడు ఎద్దుల శివ రెడ్డి, సాయి కృష్ణ ,బస్తిపాడు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రుల ప్రత్యేక దృష్టి అవసరం

## : ఎంఈవో ఉస్మాన్ బాషా



**దేవనకొండ ఏప్రిల్ 23( ప్రజారి పబ్లిక్ న్యూస్):-** దేవనకొండ మండలంలో వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో ఉస్మాన్ బాషా సూచించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు వేసవి సెలవులు అమలులో ఉంటాయని తెలిపారు. సెలవుల సమయంలో పిల్లలు ఎక్కువగా ఇంటి బయట గడిపే అవకాశం ఉండటంతో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా సరదా కోసం చెరువులు, కాలువలు, నదులు, బావుల వద్దకు వెళ్లకుండా పిల్లలను నియంత్రించాలని సూచించారు. ఇటువంటి ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, వారికి భద్రతా అవగాహన కల్పించాల్సిన బాధ్యత కుటుంబాలపై ఉందన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా తగిన ఆహారం, త్రాగునీరు తీసుకోవాలని, ఎండలో ఎక్కువసేపు ఉండకూడదని తెలిపారు. ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైన వెంటనే పెద్దలకు సమాచారం ఇవ్వాలని పిల్లలకు ముందుగానే చెప్పాలని సూచించారు.

"పిల్లల భద్రతే మన అందరి ప్రధాన బాధ్యత" అని ఎంఈవో ఉస్మాన్ బాషా స్పష్టం చేశారు. వేసవి సెలవులు ఆనందంగా గడపడంతో పాటు జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.

# వాట్సప్ గవర్నెన్స్‌తో వేగవంతమైన పోలీస్ సేవలు : సిఐ వేణుగోపాల్




**దేవనకొండ ఏప్రిల్ 23( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** దేవనకొండ మండలం లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పోలీస్ శాఖ ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందిస్తున్నట్లు సిఐ వేణుగోపాల్ తెలిపారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ విధానం ద్వారా పోలీస్ సేవలు ప్రజలకుచేరువ అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానంలో ప్రజలు నేరుగా వాట్సప్ ద్వారా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయవచ్చునిచెప్పారు. ఫిర్యాదుల నమోదు, సమాచారం అందజేత, అత్యవసర సేవలు అన్నీ ఒక్క క్లిక్‌తో అందుబాటులోకి వచ్చాయని వివరించారు. వాట్సప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే సేవలు పొందే అవకాశం ఉందని చెప్పారు. ఈ విధానం వల్ల సమయం,ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయనివెల్లడించారు. ప్రజలు పంపే సమాచారం పోలీసులకు నేర నియంత్రణలో కీలకంగా ఉపయోగపడుతుందని అన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే తెలియజేస్తే చర్యలు వేగంగా తీసుకోవచ్చని సూచించారు. వాట్సప్ హెల్ప్‌లైన్ ద్వారా అత్యవసర సమాచారం అందించడం సులభమైందని తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా పోలీస్ శాఖలు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వాట్సప్ చాట్‌బాట్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసే సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఇలాంటి సేవలతో ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. వాట్సప్ ద్వారా ట్రాఫిక్ సమాచారం, ఈ-చలాన్లు, సైబర్ క్రైమ్ ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చు. కొన్ని జిల్లాల్లో ప్రత్యేక వాట్సప్ నంబర్ల ద్వారా నేర సమాచారం స్వీకరిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యం పెరగడంతో నేరాల నివారణ మరింత సమర్థవంతంగా మారింది పోలీస్-ప్రజల మధ్య దూరం తగ్గి విశ్వాసంపెరుగుతోందని సిఐ అన్నారు. వాట్సప్ గ్రూపుల ద్వారా గ్రామస్థులతో నేరుగా కమ్యూనికేషన్ కొనసాగుతోంది. సందేహాస్పద వ్యక్తులు, సంఘటనలపై వెంటనే అలర్ట్‌లు పంపవచ్చు.

ప్రత్యేకంగా యువత ఈ సేవలను వినియోగించాలనిసూచించారు. డిజిటల్ టెక్నాలజీతో పారదర్శకత పెరిగిందనితెలిపారు. ఫిర్యాదులపై ఫాలోఅప్ కూడా సులభమైందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారంతో పోలీసులు వేగంగాస్పందించగలుగుతున్నారు. అత్యవసరపరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా వ్యవస్థ పని చేస్తోందన్నారు. సైబర్ నేరాల నివారణలో కూడా వాట్సప్ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రజలుఅపోహలు, తప్పుడు సమాచారాన్నిపంపకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమాచారం నిజమైందే పంపాలని కోరారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పోలీస్ సేవలు మరింత ప్రజానుకూలంగామారుతున్నాయని తెలిపారు. ఈ సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని సిఐ వేణుగోపాల్ పిలుపునిచ్చారు.

# విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ ల కు 5జి శాంసంగ్ స్మార్ట్‌ఫోన్లు పంపిణీ

**జిల్లాలో 908 మంది అసిస్టెంట్లకు డిజిటల్ సదుపాయం - స్వయం సహాయక సంఘాలకు సాంకేతిక బలం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)** గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 908 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ ( వివోఏ ల) కు 5జి సదుపాయం కలిగిన శాంసంగ్ స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు.

గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ-సెర్ప్ ఆధ్వర్యంలో ఈ మొబైల్ ఫోన్లను కలెక్టర్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని, ఈ దిశగా వివోఏ ల కు ఆధునిక స్మార్ట్‌ఫోన్లను అందించడం ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు ఈ సదుపాయం కల్పించడం ద్వారా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా సాగుతాయని కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యంగా సంఘాల ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని గ్రామీణ ప్రజలకు తక్షణం చేరవేయడం సులభతరం అవుతుందని ఆమె అన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్లు గ్రామీణ మహిళా సంఘాల అభివృద్ధికి దోహదపడటమే కాకుండా, గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో సాంకేతిక వినియోగాన్ని విస్తరించడంలో సహాయపడతాయని కలెక్టర్ తెలిపారు. వివోఏ లు అందరూ ఈ సదుపాయాన్ని సమర్థవంతంగా వినియోగించి సంఘాల పురోగతికి కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

**గడువులోపు పూర్తి చేయాలి**

**ఆదోని డివిజన్ రోడ్లపై ప్రత్యేక దృష్టి:**

**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)** జిల్లాలో చేపడుతున్న రోడ్లు మరియు ఇతర నిర్మాణ పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంబంధిత అధికారులను కట్టుదిట్టంగా ఆదేశించారు. ముఖ్యంగా ఆదోని డివిజన్‌లో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్ & బి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎంఎస్ఐడీసి, ఏపీఈడబ్ల్యూఐడీసి శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న సివిల్ పనుల పురోగతి, నాణ్యత నియంత్రణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్ & బి పరిధిలో మొత్తం 1886.517 కి.మీ రోడ్లు ఉండగా, గత ఏడాది 132 కి.మీ లక్ష్యానికి గాను 123.56 కి.మీ పనులు పూర్తి చేసి 93 శాతం సాధించినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 156.93 కి.మీ రోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ లక్ష్యంగా నిర్ణయించామని, వాటిని గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదోని డివిజన్‌లో గతంలో 67 కి.మీ పనులు పూర్తయ్యాయని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. రోడ్లపై ఉన్న బ్లైండ్ కర్వ్‌ వద్ద బుష్ క్లియరెన్స్ చేపట్టాలని సూచించారు.

పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను సెప్టెంబర్‌లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సైట్ క్లియరెన్స్‌కు సంబంధించిన సమస్యలను సోమవారం లోపు పరిష్కరించాలని సూచించారు. నాబార్డ్ కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం కింద జల్ జీవన్ మిషన్‌లో 300 పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం 107 పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో 2,260 యూనిట్లకు గాను 104 పూర్తయ్యాయని, 690 పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తిరిగి వచ్చేలోపు హాస్టళ్లలో తాగునీటి సౌకర్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఏపీఎంఎస్ఐడీసి పరిధిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌లో ఆక్సిజన్ పైప్‌లైన్, లిఫ్ట్ పనులను మే 31లోపు పూర్తి చేసి త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గర్ల్స్, బాయ్స్ హాస్టళ్లలో టాయిలెట్ సమస్యలను జూన్ చివరి నాటికి పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో ఆర్ & బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి, ఏపీఎంఎస్ఐడీసి ఎస్ఈ ఇంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## అనంత కలెక్టర్ ఆనంద్



**అనంతపురం ప్రతినిధి, ఏప్రిల్ 23,( రిపబ్లిక్ న్యూస్ ):** అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు.

గురువారం సాయంత్రం పామిడి లోని అంబేద్కర్ ఎస్సీ కాలనీలో పీఎం సూర్య ఘర్ ముత్తు బిసిలు యువజన కింద మంజూరైన సోలార్ ప్యానల్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ఇళ్లను సందర్శించి సోలార్ ప్యానల్ ఏర్పాటు అనంతరం లబ్ధిదారుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా లక్ష్మీదేవి అనే మహిళ జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్న నేపథ్యంలో తన ఇంటి పై భాగంలో సోలార్ ఏర్పాటు చేసుకున్నామని ప్రస్తుతం ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం పట్ల సంతోషంగా ఉన్నావని తెలిపారు.

**రీ సర్వే సమస్యలను త్వరితగత పరిష్కరించాలి**

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా 2 కె వి సోలార్ ప్యానల్ ను అమర్చడం జరుగుతుందని తద్వారా రోజుకు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. అర్హులందరూ ఇలాంటి ప్రభుత్వ పథకాలను సద్వినం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కాలనీలో ఉన్న చిన్నారులతో కాసేపు ముచ్చటిస్తూ బాగా చదువుకోవాలని ప్రస్తుత ఎండాకాలంలో ఇంటి వద్దనే ఉండాలని వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం పామిడి మండలంలోని సొరకాయల పేట గ్రామంలో యువ రైతు భార్గవ్ పొలంలో డ్రోన్ ద్వారా మందు పిచికారిని కలెక్టర్ పరిశీలించారు. డ్రోన్ వినియోగంపై యువరైతు భార్గవ్తో పలు విషయాలపై ఆరా తీశారు. డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు మందును పిచికారి చేయవచ్చునని ఉద్యాన పంటలు పండ్ల మొక్కలు వరి పేర్లకు సులభతరంగా ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం రైతు భార్గవ్ మాట్లాడుతూ 3 ట్యాంకుల మందును 2 ఎకరాల వరకు పిచికారి చేసుకునే అవకాశం ఉంటుందని డ్రోన్ విలువ సుమారు రూ. 9. 81 లక్ష దాకా అవుతుందని మందు పిచికారి చేసే పొలాల్లో విద్యుత్ స్తంభాలు తీగలు అడ్డువస్తే అలారం వస్తుందన్నారు. తన పొలంలో పిచికారి ప్రక్రియ పూర్తవగానే ఇతర రైతుల పొలాల్లో మందును పిచికారి చేస్తామన్నారు. తాను బీటెక్ వరకు చదివానని కొన్ని రోజులు సాఫ్ట్వేర్ రంగంలో కూడా ఉద్యోగం చేసి ప్రస్తుతం వ్యవసాయంపై గల మక్కువతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో రైతు కృషి వికాస్ యోజన పథకం ద్వారా ఐదు మంది సభ్యులు ఒక గ్రూపుగా ఆంజనేయస్వామి రైతుమిత్ర సంఘం గా ఏర్పడి లబ్ధి పొందుతున్నానని తెలిపారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇవ్వగా లబ్ధిదారులు 20 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. యువ రైతు తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లా కలెక్టర్ గ్రూపు సభ్యులను అభినందించారు.

అనంతరం ఎద్దులపల్లి గ్రామంలో రైతులతో ముచ్చటించారు. చిన్న కారు రైతుల సంఘాల ద్వారా ట్రాక్టర్, వ్యవసాయ యాంత్రిక పరికరాల ప్రయోజనాల పై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇలాంటి పరికరాల ద్వారా అవకాశం ఉంటుందన్నారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యలను త్వరితగత పరిష్కరించాలని , పీహెచ్సీ లో వైద్య సిబ్బంది పనితీరుపై అక్కడున్న రైతులు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయగా దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గతంలో జరిగిన వాస్తవ స్థితిగతులను పరిశీలించి రైతుల సమస్యను పరిష్కరించాలని ,తాసిల్దార్ ను ఆదేశించారు. వైద్య అధికారులను మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అనంతరం జల ధార జల హారతి పనులను గుర్తించాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేజోష్ణ, తాసిల్దార్ షర్మిల, ఏపీ ఎస్పీడీసీఎల్ ఈ ఈ, ఇరిగేషన్ డి ఈ బసవరాజు,ట్రాన్స్కో ఈ ఈ మధు వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్ డిప్యూటీ ఎంపీడీవో అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు.

# "మీ రక్షణ మా బాధ్యత"

## : మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం

**బాల్య వివాహాలు, మహిళలపై నేరాల నివారణపై పోలీసుల దృష్టి శక్తి యాప్ వినియోగానికి ప్రోత్సాహం**





**ఓర్వకల్లు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)** మహిళల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ "మీ రక్షణ మా బాధ్యత" పేరుతో అవగాహన కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల కేంద్రంలోని పొదుపు భవనంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ద్వారానే సమాజంలో అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు.

మహిళలు శక్తి యాప్ వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోవాలని సూచిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు.

మహిళలు ఎటువంటి వేధింపులు ఎదుర్కొన్నా సంకోచం లేకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని పిలుపునిచ్చారు. అత్యవసర సహాయం కోసం 112, 181, 1098, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, పట్టణాలు, గ్రామాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**మహిళలు ముందుండాలి ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**

మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, కష్టపడి విజయాలను సాధించాలని అన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.

కాల్వబుగ్గ రామేశ్వరం ఆలయంలో జరిగిన దొంగతనం కేసును చేధించినందుకు ఎస్పీని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్‌కు రూ.15 వేల విలువ గల స్మార్ట్‌ఫోన్లు అందజేసినట్లు తెలిపారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం**

పొదుపు సంఘం అధ్యక్షురాలు విజయభారతి మాట్లాడుతూ మహిళలు అత్యవసర సమయంలో శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో శాలివాహన స్టేట్ చైర్మన్ పార్వతమ్మ, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్సై సునీల్ తదితరులు పాల్గొనగా, పెద్ద ఎత్తున స్థానిక మహిళలు హాజరయ్యారు.

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా ప్రతిపాదించింది. జిల్లా వ్యాప్తంగా



నిరంతరం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగనున్నట్లు పోలీసులు తెలిపారు.



# బ్యాంకింగ్ సేవల పై అవగాహన

## :-ప్రజలు ఆర్థిక అక్షరాసత ను పెపోండిచాలి -శాంతిపురం మండలం ఆర్బిఐ వెడ్స్ కౌన్సిలర్ ఎస్ శివకుమార్

**కుప్పం (రిపబ్లిక్ న్యూస్) ఏప్రిల్ 23**
కార్యక్రమం చిన్నకర్లగట్టు విలేజి కర్లఘట్ట గ్రామపంచాయతీ శాంతిపురం మండలం చిత్తూరు జిల్లా గుడిపల్లి సిఏపాల్ సెంటర్ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి కర్లకట్ట గ్రామపంచాయతీ యూనిట్ ఇన్చార్జి గిరిధర్ మరియు కర్లఘట్ట గ్రామపంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ మరియు శివ అధ్వరంలో ఈరోజు చిన్నకర్లగడ్డ గ్రామంలో ఆర్థిక అక్షర అవగాహన కల్పించడం జరిగింది అదేవిధంగా విడ్స్ కౌన్సిలర్ ఎస్సీ కుమార్ సెక్యూరిటీ స్కీమ్స్ అండ్ సెంట్రల్ స్కీమ్స్ పి ఎం ఎస్ బి వై మరియు పి ఎం జె జె బి వై ఇన్సూరెన్స్ గురించి తెలియజేయడం జరిగింది అదేవిధంగా చిన్నపిల్లలకు 10 సంవత్సరాల కింద ఉన్న వాళ్లకు ఎస్ ఎస్ వై సుకన్య సమృద్ధి యోజన పొదుపు పథకం గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది . మరియు 18 సంవత్సరాల కింద ఉన్న వాళ్లకు ఎన్పీఎస్ వాత్సల్య గురించి వివరించడం జరిగింది మరియు ఈ మధ్యకాలంలో సైబర్ మోసాల గురించి వివరించడం జరిగింది మరియు జె వి డి ఎకౌంటు రూపే కార్డు ద్వారా




ఏ విధంగా ఉపయోగాలు ఉన్నాయి అది ఎవరు చేసుకోవాలి అనే దాని గురించి క్లుప్తంగా చెప్పడం జరిగింది మరియు బ్యాంక్ ఆప్స్ ఏ విధంగా అప్డేట్ చేసుకోవాలి దాని ద్వారా ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది దాని గురించి చెప్పడం జరిగింది ఈ కార్యక్రమానికి ఈనుటి ఇన్చార్జ్ గిరిధర్ గారు మరియు పార్టీ ప్రెసిడెంట్ మురుగేష్ గారు మరియు శ్రీనివాసులు గారు చంద్ర గారు ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ శివ మరియు ఆర్బిఐ వెడ్స్ సి ఎఫ్ ఎల్ ఎస్ ఓ కుమార్ డి హరి కె.ఆర్ రెడ్డప్ప హాజరైనారు మరియు గ్రామస్తులు



# చికాగో అమరవీరుల స్ఫూర్తితో మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి.

**అందోల్ ప్రతినిధి ఏప్రిల్ 23 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు కార్మికులకు పిలుపునిచ్చారు ఈరోజు సీఐటీయూ సంగారెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సుందరయ్య భవన్లో నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు
ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు మాట్లాడుతూ 140 ఏళ్ల క్రితం చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిందని గుర్తు చేశారు. ఆనాడు కార్మికులు చిందించిన రక్తం ఫలితంగానే 8 గంటల పని విధానం, సెలవు సౌకర్యాలు మరియు కనీస వేతన చట్టాలు ఏర్పడ్డాయని తెలియజేశారు.ప్రస్తుత




కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని కార్పొరేట్ అనుకూల 4'లేబర్ కోడ్‌లు'గా మార్చడం కార్మిక వర్గానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే వెసులుబాటును ఈ కోడ్‌లు కల్పిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన సంఘటితమయ్యే హక్కు, నిరసన హక్కు, సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే అధికారాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు యాజమాన్య భద్రత కవచాలుగా మారడం శోచనియం అన్నారు.
సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలవుతున్న నేపథ్యంలో దేశంలో పెరిగిన ద్రవ్యల్బణం, ఇండ్ల అద్దెలు,ఆహార ధరలు, పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు కార్మికులకు మోయలేని భారాలైన నేపథ్యంలో కార్మికుల సంఘటితమై తమ బ్రతుకులు మార్చుకోవడం కొసం ఈ మేడే ను ఉద్యమంగా వాడవాడలా గ్రామ గ్రామాన, పట్టణాలలో వాడవాడనా పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి మే డే జెండాలను ఎగురవేసి పోరాట స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు.
ఈకార్యక్రమంలోసీఐటీయూ నాయకులు సదానందం శ్రీనివాస్ లక్ష్మణ్ యాదయ్య నర్సింలు రాజేష్ గౌతమ్ సుగుణ నరసమ్మ వీరవాని లక్ష్మీ సంగీత మంజుల మల్లమ్మ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# కుప్పం గంగమ్మ ఆశీస్సులతో 'తిమ్మరాజు పల్లి టీవీ, డైరెక్టర్ మునిరాజు, మరియు, సినిమా,టీమ్ సన్మానంలిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్







**కుప్పం రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23 గురువారం**
ఈరోజు మన కుప్పంలో నియోజకవర్గం, శాంతిపురం మండలం, తిమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన "తిమ్మరాజు పల్లిుఎ" సినిమా డైరెక్టర్ గారు మరియు వారి బృందం, సినిమా విజయవంతం కావడంతో కుప్పం గంగమ్మ తల్లిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా చిత్ర బృందాన్ని ఆత్మీయంగా అభినందించి, ఘనంగా సన్మానించడం జరిగింది. కుప్పం యువత కళలపై చూపిస్తున్న ఆసక్తి, ప్రతిభ, ఉత్సాహం నిజంగా అభినందనీయం.
మన నియోజకవర్గం నుంచి వచ్చిన ఈ యువ ప్రతిభను మనస్ఫూర్తిగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు రూపొందించి, రాష్ట్రస్థాయిలో, దేశస్థాయిలో మన కుప్పంకు మంచి పేరు తీసుకురావాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. స్థానిక కళాకారులను ఇలాగే ప్రోత్సహిస్తూ ముందుకు సాగుదాం ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం టిడిపి యువ నాయకులు,వినయ్ జనసేన నాయకులు,పవన్ మహేష్ మరియు తిమ్మరాజపల్లి టీవీ సినిమా బృందం మరియు టిడిపి,నాయకులు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగినది

# హజ్ యాత్రికుల సామాగ్రి గల్లంతు

## ప్రణాళికా లోపాలపై తీవ్ర విమర్శలు

**విజయవాడ నుంచి మదీనా వెళ్లిన యాత్రికుల 289 బ్యాగులు అదృశ్యం - సమన్వయ లోపం, అనుసంధాన విమానాలే కారణమా?**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)**
2026 హజ్ యాత్ర ఏర్పాట్లలో జరిగిన లోపాలు వెలుగులోకి రావడంతో రాష్ట్ర హజ్ కమిటీపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విమానాల సమన్వయం, సామాగ్రి నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యం వల్ల వందలాది మంది యాత్రికులు మదీనాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ఏప్రిల్ 19న విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి మదీనాకు బయలుదేరిన యాత్రికులకు చెందిన 289 బ్యాగులు గమ్యస్థానానికి చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ బ్యాగుల్లో ఇహ్రామ్ దుస్తులు, ప్రాణరక్షక మందులు వంటి అత్యవసర వస్తువులు ఉండటంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.
రాయలసీమ ప్రాంతానికి చెందిన యాత్రికులు సౌకర్యాల కోసం హైదరాబాద్, బెంగళూరు కేంద్రాలకంటే విజయవాడను ఎంపిక చేసుకోవడం ఇప్పుడు వారి నిర్ణయంపై ఆవేదన కలిగిస్తోంది.

**లోపాలపై అనుమానాలు :**
నేరుగా అంతర్జాతీయ విమానాలు ఏర్పాటు



చేయకపోవడం
మధ్యలో అనుసంధాన (కనెక్టింగ్) విమానాల వినియోగం
చిన్న విమానాల సరుకు రవాణా సామర్థ్యం తక్కువగా ఉండటం
భారీ రద్దీలో సామాగ్రి గుర్తింపు (ట్యాగింగ్) లో గందరగోళం
విమానయాన సంస్థలు హజ్ కమిటీ మధ్య సమన్వయం లోపం

ఈ అంశాలే బ్యాగులు దారితప్పడానికి కారణమని యాత్రికులు ఆరోపిస్తున్నారు.

**కోల్‌కతాలోనే సామాగ్రి?**
ప్రస్తుతం గల్లంతైన బ్యాగులు కోల్‌కతాలో ఉన్నాయని హజ్ కమిటీ అధికారులు చెబుతున్నప్పటికీ, యాత్రికుల్లో అసంతృప్తి తగ్గడం లేదు. కోట్లు ఖర్చు చేసినప్పటికీ కనీస నిర్వహణ లోపించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**యాత్రికుల డిమాండ్:**
తిరుగు ప్రయాణంలో అయినా
యాత్రికులు, వారి సామాగ్రి ఒకే విమానంలో పంపించాలి
నేరుగా అంతర్జాతీయ విమాన సదుపాయం కల్పించాలి
సమన్వయం మెరుగుపరచాలి
అని యాత్రికులు డిమాండ్ చేస్తున్నారు.
ఈ ఘటన హజ్ యాత్ర నిర్వహణలో ప్రణాళికా లోపాలను బహిర్గతం చేస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# బులెట్ దండపాణి గృహప్రవేశం

## ఉత్సాహంగా,వైఎస్ఆర్సీపీ శ్రేణులతో పాల్గొనడం జరిగినది ముఖ్యఅతిథి రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి







**శాంతిపురం ( రిపబ్లిక్ న్యూస్) ఏప్రిల్ 23** పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారు – రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, భరత్– చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీకుప్పం నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త జిఎస్,సెందిల్ కుమార్ – మాజీ రెస్కో చైర్మన్హఫీజ్ – కుప్పం మునిసిపల్ వైస్ చైర్మన్, వైఎస్ఆర్సిపి మున్సిపల్ అధ్యక్షుడుఇతర నాయకులు:– మోహన్ రామ్, మునిరాజులి – ఉపాధ్యక్షులు– నాగరాజు, రాజ్ కుమార్ – కౌన్సిలర్లు– వైఎస్ఆర్సీపీ వార్డు ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బులెట్ దండపాణి శాంతిపురం మండల వైయస్ఆర్సీపీ కన్వీనర్శాంతిపురం మండలంలో పార్టీ శ్రేణులు ఐక్యమత్యముగా ఉన్నాయని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది.

# పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శ





**రామకుప్పం రిపబ్లిక్ న్యూస్.. ఏప్రిల్ 23**
రామకుప్పం మండలం బందర్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ వైకాపా నాయకులు అడ్వకేట్ అమర్నాథ్ రెడ్డి ఇటీవల గాయపడి శాస్త్ర చికిత్స చేసుకున్నారు నేడు మాజీ మంత్రివర్యులు పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి నివాసానికి విచ్చేసి పరామర్శించడం జరిగింది కార్యక్రమంలో చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఎమ్మెల్సీ భరత్ మాజీ రేస్కో చైర్మన్ సందిల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి రాష్ట్ర కార్యదర్శి పిఎన్ఎన్ నాగరాజు జడ్పిటిసిలు నితిన్ రెడ్డి శ్రీనివాసులు కృష్ణమూర్తి బందర్లపల్లి మాజీ సర్పంచ్ రాజగోపాల్ రామకుప్పం వైకాపా నాయకులు శోభన్ రెడ్డి సెందిల్ హర్షరెడ్డి అప్పి పాల్గొన్నారు

# ఆంగన్వాడి మీటింగ్ కు హాజరైన కౌన్సిలర్

## పిల్లలతో ముచ్చటించిన ఊర్మిళ దుర్గేష్




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 23( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జోగిపేటలోని అంగన్వాడి రెండు సెంటర్ల పిల్లలను ఒకే దగ్గర మీటింగ్ పెట్టడం జరిగింది.
అక్కడ ముఖ్య అతిథులు 14వ వార్డు కౌన్సిలర్ ఊర్మిల దుర్గేష్ ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది రెండు అంగన్వాడీ స్కూల్ టీచర్లు డి. సావిత్రి, ఏ.చంద్రకళ పిల్లలను ఒకే పాఠశాలలో మూడు సంవత్సరాల నుండి అంగన్వాడి కేంద్రంలో చదివినటువంటి రెండు సెంటర్ల పిల్లలను ఒకే దగ్గర మీటింగ్ పెట్టడం జరిగింది. అందులో భాగంగా మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల వరకు అంగన్వాడి స్కూల్లో పిల్లలకు అ ఆ లు, ఏ బి సి డి లు, బొమ్మలు కొన్ని చిలకల పేర్లు ఆటపాటలతో బొమ్మలు ఇవన్నీ బొమ్మల పేర్లు చెప్పడం జరిగింది. అంగన్వాడి ఆ పిల్లలకు ఆటపాటలతోటి మరియు అక్షరాభ్యాసం చెప్పడం ఇప్పుడు ఈ పిల్లలను ఒకటవ తరగతి నుండి కొంత మంది పిల్లలను పై చదువుల నిమిత్తం సి.పి.ఎస్ స్కూల్లో చేర్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్రానికి సంబంధించి ఆయమ్మలు మరియు పిల్లల తల్లిదండ్రులు కూడా పాల్గొనడం జరిగింది.

# ఉయ్యాలవాడలో నూతన గృహప్రవేశానికి హాజరైన వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి









**ఓర్వకల్లుప్రతినిధి, ఏప్రిల్ 23, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**ఓర్వకల్లు మండలం : ఉయ్యాలవాడ గ్రామంలో వైఎస్సార్సీపీ కార్యకర్త బోయ సుబ్బారాయుడు ఆహ్వానం మేరకు నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నాగేశ్వర రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, రామిరెడ్డి, గోపాల్ రెడ్డి, రవి రెడ్డి, మోహన్ రెడ్డి, సుబ్బారాయుడు, మాజీ సర్పంచ్ మాదన్న, దేవదానం తదితరులు పాల్గొన్నారు



- తీవ్ర ఇబ్బందులలో పెట్రోల్, డీజిల్ వాహన చోదకులు
- బ్లాక్ మార్కెట్లో కొరతను ఆసరాగా
- రోడ్లపై తీవ్ర ట్రాఫిక్ జామ్
- ఎలక్ట్రికల్ బ్యాటరీ వాహనాలే బెస్ట్ అనే సమయం

# నంద్యాల జిల్లాలో పెట్రోల్, డీజిల్ కరువు

నంద్యాల, ఏప్రిల్ 23, (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నెలకొన్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం (ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు) వల్ల సరఫరా వ్యవస్థపై ప్రభావం పడిందని నిపుణులు భావిస్తున్నారు. సరఫరా తగ్గడంతో ఉన్న కొద్దిపాటి స్టాక్ కోసం వాహనదారులు పెట్రోల్ బంకుల బారులు తీరుతున్నారు. కొన్ని బంకుల వద్ద పెట్రోల్ అందుబాటులో ఉంటే, మరికొన్ని బంకుల వద్ద డీజిల్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. మరికొన్ని బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ ఏవి అందుబాటులో లేవని అక్కడ పనిచేసే సిబ్బంది స్టాక్ లేదు వెళ్లిపోండి అని చెబుతున్నారు.



## తీవ్ర ఇబ్బందులలో పెట్రోల్, డీజిల్ వాహన చోదకులు

క్షేత్రస్థాయిలో బంకులకు సకాలంలో స్టాక్ అందకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ పెట్రోలు, డీజిల్ లేకపోతే వాహనాలు నిలిచిపోయి సదర్ ప్రయాణ అవసరాలకు ఇబ్బందులకు గురవుతామని ప్రజలు, ఉద్యోగాలకు వెళ్లేవారు. ఇతర వాహనాలలో పూజ పనులకు వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

## బ్లాక్ మార్కెట్లో కొరతను ఆసరాగా

బ్లాక్ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ కొరతను ఆసరాగా చేసుకుని కొందరు చిల్లర దుకాణ వ్యాపారస్తులు అక్రమంగా 110.15 ఉన్న లీటర్ పెట్రోల్‌ను రూ.150 వరకు, డీజిల్ రూ.140 వరకు విక్రయిస్తున్నట్లు బాధిత వాహన చోదకులు పేర్కొంటున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు ప్రధాన పట్టణాల్లోనే ట్యాంక్ ఫుల్ చేయించుకోవడం మంచిది, ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లోని బంకులు ఎక్కువగా మూతపడి ఉంటాయని నంద్యాల పట్టణ ప్రాంతాల పెట్రోల్ బంకులలో వాహనచోదకులు పెట్రోల్, డీజిల్ కొరకు బారులు తీరారు.

## రోడ్లపై తీవ్ర ట్రాఫిక్ జామ్

నంద్యాల పట్టణంలో పలు ప్రదేశాలలో పెట్రోల్, డీజిల్ కొరకు ద్విచక్ర, ద్విచక్ర వాహనాలు, జెసిబిలు, నాలుగు చక్రాల వాహనాలు రోడ్లపై నిలిచి ఉండడంతో పెట్రోల్ బంకుల ప్రాంతాలలో భారీగా ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.







## ఎలక్ట్రికల్ బ్యాటరీ వాహనాలే బెస్ట్ అనే సమయం వచ్చింది

ప్రస్తుత సమయంలో పెట్రోలు, డీజిల్ గురువారంతో ఇండియాలో అందుబాటులో లేకపోవడంతో ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించే వాహన చోదకులు తమకు పెట్రోల్ ఇబ్బందులు తప్పాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రికల్ బ్యాటరీ ఆటో డ్రైవర్లు సైతం తగిన ధరలు ప్రయాణికులు ఇస్తారని ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.



---

# చీకటిలో చితికిపోతున్న మహిళలు..

## పోష్ చట్టం అమలులో ఘోర వైఫల్యం

**మొక్కుబడిగా కమిటీల నమోదు జిల్లాలో వందలాది సంస్థల బేఖాతరు**

**ఫిర్యాదు చేయలేని పరిస్థితిలో మహిళలు... అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 23)**
కర్నూలు జిల్లాలో పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 2013లో తీసుకొచ్చిన పోష్ (లైంగిక వేధింపుల నివారణ) చట్టం అమలు పూర్తిగా అటకెక్కిన పరిస్థితి కనిపిస్తోంది. చట్టం అమలులో పదమూడు సంవత్సరాలు గడిచినా, క్షేత్రస్థాయిలో మహిళా ఉద్యోగులకు భరోసా కల్పించడంలో సంబంధిత శాఖలు విఫలమయ్యాయి. మహిళల భద్రతకు కీలకమైన ఈ చట్టం కేవలం పుస్తకాలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**కమిటీల లేమితో నలిగిపోతున్న మహిళలు**

పది మందికి పైగా ఉద్యోగులు ఉన్న ప్రతి సంస్థలో తప్పనిసరిగా ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ (ఐసిసి)) ఏర్పాటు చేయాల్సి ఉన్నా, జిల్లాలో వందలాది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఈ నిబంధనలను పాటించడం లేదు. కమిటీలు లేకపోవడం వల్ల బాధిత మహిళలు ఎవరిని సంప్రదించాలో తెలియక మౌనంగా వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసే వ్యవస్థ లేకపోవడం మహిళల సమస్యలను మరింత తీవ్రతరం చేస్తోంది.

**పర్యవేక్షణలో అధికారుల వైఫల్యం**

చట్టం అమలును జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాల్సి ఉండగా,



మహిళా శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారులుగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలి. కానీ ఈ పర్యవేక్షణలో తీవ్ర లోపాలు కనిపిస్తున్నాయి. ఆకస్మిక తనిఖీలు లేకపోవడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడం వల్ల సంస్థలు చట్టాన్ని పట్టించుకోవడం లేదు.

**నిరసనలు వచ్చినా న్యాయం జరగని ఘటనలు**

జిల్లాలో పలు ఘటనలు వెలుగులోకి వచ్చినా బాధితులకు న్యాయం జరగలేదు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సఫాయి కార్మిక మహిళలపై అసభ్య ప్రవర్తన ఆరోపణలు వచ్చి నిరసనలు జరిగినా చర్యలు కనిపించలేదు. అదే విధంగా ఏపీ ఎంఎస్ఐడీసీ, విద్యాశాఖ వంటి కార్యాలయాల్లో కూడా మహిళలపై వేధింపుల ఆరోపణలు వచ్చినా ఐసిసి లేకపోవడంతో కేసులు నిర్వీర్యమయ్యాయి.

**అసలు కేసులు బయటపడడంలేదు**

2016 నుంచి ఇప్పటివరకు జిల్లాలో కేవలం 12 కేసులు మాత్రమే నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఇది అసలు పరిస్థితిని ప్రతిబింబించదని స్పష్టంగా తెలుస్తోంది. ఫిర్యాదు



చేసే వేదిక లేకపోవడం వల్ల అనేక కేసులు బయటకు రాకుండానే ముగుస్తున్నాయి.

**చట్టం ఉన్నా అమలు లేదు**

పోష్ చట్టం ప్రకారం కమిటీలు ఏర్పాటు చేయని సంస్థలపై రూ.50,000 వరకు జరిమానా విధించాలి. పునరావృతం అయితే లైసెన్సులు రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయినా అమలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది.

**వన్ స్టాప్ సెంటర్ సేవలు ఉన్నా వినియోగం తక్కువ**

బాధిత మహిళలకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా వైద్య, పోలీస్, న్యాయ, కౌన్సెలింగ్, ఆశ్రయం వంటి ఐదు సేవలు అందుబాటులో ఉన్నా, అవగాహన లోపం వల్ల చాలా మంది వాటిని వినియోగించుకోలేకపోతున్నారు.

**అవగాహన లేకే సమస్య తీవ్రత**

క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు లేకపోవడం, ప్రైవేట్ సంస్థలపై ఒత్తిడి లేకపోవడం వల్ల ఈ చట్టం గురించి చాలా సంస్థలకు తెలియని పరిస్థితి ఉంది. కలెక్టరేట్‌లోనే పలు శాఖల్లో ఐసిసి లు లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**అధికారుల స్పందన ఇదీ...**

జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ వివరాల ప్రకారం, తాను బాధ్యతలు స్వీకరించినప్పుడు కేవలం 40-50 కమిటీలు మాత్రమే ఉన్నాయని, ప్రత్యేక డ్రైవ్ ద్వారా ప్రస్తుతం 256కి పెంచినట్లు తెలిపారు. ఇంకా కొన్ని సంస్థల్లో మాత్రమే కమిటీలు ఏర్పాటు మిగిలి ఉన్నాయని, త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.

**ఇప్పటికైనా మేల్కొనాలి**

మహిళా సంఘాలు, ప్రజా సంస్థలు జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ప్రతి సంస్థలో ఐసిసి లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. మహిళల భద్రతపై రాజీ పడితే సమాజంపై తీవ్ర ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# ప్రజా రిపబ్లిక్ న్యూస్ వార్తకు స్పందించిన విద్యాశాఖ అధికారులు

## గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ2 అబ్రహం

**బేతంచెర్ల ప్రతినిధి, ఏప్రిల్ 23,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మధ్యాహ్న భోజన విధానం గురించి పత్రికలో వచ్చిన కథనాన్ని గమనించి ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ 2 అబ్రహం

పేద పిల్లలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక అమలు తీరును గురించి ఎంఈఓ 2 అబ్రహం గారు ఆకస్మిక తనిఖీ చేసి ఏ.పీ.మోడల్ స్కూల్ గోరుమానుకొండ పాఠశాలను పరిశీలించి తగు వివరాలను సేకరించారు.పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ మరియదాసు సమక్షంలో విచారణ చేపట్టిన ఎంఈఓ పిల్లలతో ముఖాముఖి మాట్లాడి వారు చెప్పిన అంశాలను సేకరించారు. వంటకు సంబంధించి వాడేటువంటి పదార్థాలు కూరగాయలు గాని నూనె గాని ఉప్పు గాని కారము గాని సరిపడా లేవని గమనించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం ఉండేటువంటి వంటవారు వ్యక్తిగత శుభ్రతను పాటించకపోవడం గమనించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ మరియు ప్రిన్సిపల్ గారు ఎన్నిసార్లు చెప్పినా మధ్యాహ్న భోజన వడ్డించే ఏజెన్సీ వారు భోజనం వండడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని తెలియజేశారు. వీటిని సమీకరించుకొని పై అధికారులకు సమాచారాన్ని సమర్పిస్తారని తెలియజేశారు.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com